విశాలాంధ్ర విజయనగరం

పేజి నెం. 9

శుక్రవారం, 19 డిసెంబర్ 2025

ప్రజల దృష్టిలో మమ్మల్ని అసమర్దులుగా చేస్తారా..!

- అభివృద్ధి కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆపేశారు
- సచివాలయాలలో సిబ్బందే ఉండడంలేదు
- నగర పాలక సమావేశంలో సభ్యుల నిలదీత

విశాలాంధ్ర-విజయనగరం: 'మావార్డులలో అభివృద్ధి పనులకు ఆమోదం ఇచ్చాం.. నిధులు మంజూరయ్యాయి. మద్యలో పనులు ఆపేశారు. దీనిపై కనీసం మాకు సమాచారంలేదు. ఇప్పుడు సమావేశంలో అడిగితే ఆపనులు రద్దు చేసామని చెబుతున్నారు. మాకు ఇంకా 90 రోజుల పదవీకాలం మాత్రమే ఉంది. అంటే ప్రజల దృష్టిలో మమ్మల్ని అభివృద్ధి చేయలేని అసమర్దులుగా చూపిస్తారా..' అంటూ విజయనగరం నగర పాలక కార్పోరేటర్లు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేసారు. గురువారం నగర పాలక స్టాండింగ్ కమిటీ సమావేశం కార్యాలయంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో ముందుగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, ప్రస్తుత ఎజెండాలను చదివి వినిపించారు. సమావేశంలో అధిక శాతం మంది సభ్యులు తమ వార్డులలో ఆగిపోయిన పలు సిసిరోడ్లు, డ్రైనేజీలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను నిలదీసారు. పనులు ఎందుకు ఆపారని ప్రశ్నించారు. దీనికి ఇంజినీరింగ్ అధికారులు సమాధానమిస్తూ కొన్ని పనులను పూర్తిగా రద్దు చేయడం జరిగిందని, కొత్త టెండర్లును పిలుస్తామని చెప్పారు. ఈవిదంగా మొత్తం నగర పాలక సంస్థ పరిదిలో 89 పనులు పూర్తి అయ్యాయని, మరో 82 పనులు ప్రగతిలో ఉన్నాయని, 79 పనులు ప్రారంభించారని, 32 పనులు ప్రారంభం కాలేదని సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు.

సచివాలయాలపై ఫిర్యాదుల వెల్లువ

నగరంలోని 61 సచివాలయాలలోని కొన్నిటిలో సిబ్బంది కొరత కారణంగా ఇన్‌చార్జిల పాలన సాగుతోందని, దీంతో ఎవరు ఎప్పుడు ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సచివాలయాల సిబ్బంది కార్పోరేటర్‌లకు తగిన విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. వ్యవస్థను ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారని సభ్యులు నిలదీసారు. దీనికి కమీషనర్ పల్లి నల్లనయ్య సమాధానం ఇస్తూ సచివాలయాలలో సిబ్బంది కొరత రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, ప్రభుత్వం భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు. ఏవార్డులోనైనా సిబ్బంది సకాలంలో హాజరుకాకపోయినా, విదుల పట్ల నిర్లక్ష్యం వహించినా నాదృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తాను వారానికి 5 సచివాలయాలను తనిఖీ చేస్తున్నానని తెలిపారు. అలాగే కొన్ని వార్డులలో పార్కులను ఆక్రమించారని, తొలగించాలని సభ్యులు తెలిపారు. త్వరలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆక్రమణలు తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో పలు అంశాలపై సభ్యులు అధికారులను వివరణ అడిగారు. ఈసమావేశంలో పాలక వర్గ సభ్యులతోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ, గృహనిర్మాణంలో గణనీయ ప్రగతి

- అర్థికాభివృద్దిరేటులో జిల్లాకు 8వ స్థానం - మున్సిపల్ సేవల్లో భేష్
కలెక్టర్ రాంసుందర్ రెడ్డికి ప్రశంసలు

విశాలాంధ్ర-విజయనగరం: అభివృద్ధి రేటులో విజయనగరం జిల్లా గణనీయమైన ప్రగతిని సాధించింది. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమల్లో, ప్రజలకు సకాలంలో సక్రమంగా సేవలను అందించడంలో కూడా మెరుగైన పనితీరు కనపర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి అభినందనలు దక్కాయి. ముఖ్యంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ, పేదలకు గృహనిర్మాణంలో కూడా జిల్లా ప్రశంసలను అందుకుంది. వివిధ కార్యక్రమాల అమలుపై తరచూ ప్రభుత్వం నిర్వహించే ఐవిఆర్ఎస్ సర్వేలో 69.14 శాతం సానుకూలత వ్యక్తం కావడంతో, జిల్లాకు మెరుగైన స్థానం దక్కింది. ప్రభుత్వం రెండు రోజులపాటు రాష్ట్ర రాజధానిలో కలెక్టర్స్‌తో ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాల్లో జిల్లా ప్రగతికి అభినందనలు దక్కాయి. కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి నిరంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలను నిర్వహించడం, వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రభుత్వ కార్యక్రమాలను పరుగులు పెట్టించడంతో, అభివృద్ధిరేటులో జిల్లాకు రాష్ట్రం లోనే 8వ స్థానం దక్కింది. ఈ అర్థసంవత్సరంలో మన జిడిపి వృద్ధిరేటు గణనీయంగా పెరిగింది. అదేవిధంగా వచ్చే అర్ధసంవత్సరంలో, రాష్ట్రంలో 80 శాతం ఆదాయాన్ని ఇచ్చే జిల్లాల్లో విజయనగరం జిల్లాకు కూడా చోటు దక్కనుండటం మన ప్రగతికి తార్కాణంగా చెప్పవచ్చు. స్వర్ణాంధ్ర పది సూత్రాల్లో భాగంగా, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, వారి ఉపాధి అవకాశాలను మెరుగు పర్చేందుకు చేపట్టిన నైపుణ్య శిక్షణా కార్యక్రమాల్లో రాష్ట్రంలోనే 3వ స్థానం దక్కడం విశేషం. గృహనిర్మాణ పథకం పిఎంఎవై అమల్లో జిల్లాకు నాల్గవ స్థానం దక్కింది. జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి పిజిఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడం, ప్రతీవారం సమీక్షలు నిర్వహిస్తుండటంతో, వ్యక్తిగత ఫిర్యాదులకు సంబంధించి ప్రజలనుంచి 97 శాతం సానుకూల అభిప్రాయం వ్యక్తమయ్యింది. అదేవిధంగా సామాజిక ఫిర్యాదులకు సంబంధించి 100 శాతం సానుకూలత వ్యక్తం కావడం చెప్పుకోదగ్గ విశేషం. అదేవిధంగా పురపాలక సేవల్లో కూడా మన జిల్లాకు అభినందనలు దక్కాయి.

రావాడలో విజ్ఞాన ప్రదర్శన

విద్యార్థుల ప్రతిభకు అధికారుల ప్రశంసలు

విశాలాంధ్ర-భోగాపురం: మండలంలోని రావాడ పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి గౌరవ జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారి, జిల్లా బాల విద్యాభివృద్ధి బోర్డు కన్వీనర్ సన్యాసి రాజు హాజరైయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి సన్యాసినాయుడు విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ విజ్ఞాన నమూనాలను పరిశీలించారు. వాటి వెనుక ఉన్న ఆలోచనలు, ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి చర్చ నిర్వహించారు.వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు తీరుపై విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధపడాలనే అంశంపై అధికారులు విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.మండల స్థాయిలో గెలుపొందిన ఉత్తమ విజ్ఞాన ప్రదర్శనాంశాలు నేడు విజయనగరం సంస్కృత పాఠశాలలో జరగనున్న జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ప్రదర్శించనున్నారు. మండల విద్యాశాఖ అధికారులు,రావాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది

రేగిడి లో 15 ఎకరాల చెరకు తోట దగ్ధం

విశాలాంధ్ర-రేగిడి: రేగిడి మండలం లో రేగిడి గ్రామం వద్ద గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పది మంది రైతులకు చెందిన మొత్తం 15 ఎకరాల చెరకు తోట మంటల్లో పూర్తిగా దగ్ధమైంది.స్థానికంగా చెత్తకు నిప్పు పెట్టిన సమయంలో గాలి వేగంతో మంటలు ఎగబాకి చెరకు తోటకు వ్యాపించాయని ప్రాథమిక సమాచారం. విషయం తెలుసుకున్న వెంటనే పాలకొండ అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరంతో పాడి రైతులకు మేలు

-గర్భకోశవ్యాధులపై అవగాహన -కృత్రిమ ధారణ సేవలు

- పశు వైద్యాధికారిణి డాక్టర్ కోరాడ గాయత్రి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య మరియు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని మండల పశు వైద్యాధికారిని డాక్టర్ కోరాడ గాయత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.ఈ శిబిరంలో 21 మంది పాడి రైతులకు చెందిన పశువులకు విస్తృత వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా 7 పశువులకు కృత్రిమ ధారణ ఇంజెక్షన్లు,22 పశువులకు చూలు తనిఖీలు నిర్వహించగా, గర్భకోశ వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.శిబిరంలో పాల్గొన్న పశువైద్యులు రైతులకు పశువులు ఈనిన తర్వాత 3%-%4 నెలల లోపు చూలు కట్టిస్తే ఏటా ఒక ఈతను పొందవచ్చని వివరించారు.అలాగే శీతాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించారు.ఈ శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొని రైతులకు మార్గదర్శనం చేశారు. ఉచిత వైద్య సేవలతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేశారు.

150 మందికి వైద్య పరీక్షలు



విశాలాంధ్ర-బాడంగి: మండలం,మల్లం పేట గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి చికిత్స అందించమని నర్పంచ్ పద్మావతి తెలిపారు. అపోలో హాస్పిటల్స్ వారిచే మల్లం పేట బాపు ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ జరింగింది, ఇందులో స్త్రీల వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్ మొదలగు వైద్యులు పాల్గొని సుమారుగా 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసిరి, ఇందులో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

కస్పా హై స్కూల్ విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ అవగాహన సదస్సు



విశాలాంధ్ర-విజయనగరం: పట్టణంలోని కస్పా హైస్కూల్ లో రహదారుల భద్రత అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి రవాణా శాఖ ఎమ్ వి ఐ రవి శంకర్, టౌన్ ట్రాఫిక్ ఎస్ ఐ చిన్నారావు హాజరయ్యారు. కార్యక్రమంలో మజ్జి అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్ సేఫ్టీలో గుడ్ సమ్రిటన్ గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే వారిని మానవతా దృక్పథంతో దగ్గరున్న హాస్పిటలకు తీసుకువెళ్లి సహాయం చేయాలని, అవసరమైన చోట 104,108 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు వివరించారు. అలా చేసినవారికి గౌరవ కలెక్టర్ చేతుల మీదగా ప్రశంస పత్రం మరియు 5000 రూపాయల నగదుతో బహుమతి అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రమాదాలను నివారణ విద్యార్థులకు వివరించడం జరిగింది. ఎమ్ వి ఐ రవి శంకర్ మాట్లాడుతూ రోడ్డు పై నడిచేటప్పుడు నియమ నిబంధనలు పాటించాలని, లైసెన్సులు, ఇన్సూరెన్స్ లు అన్ని వాహనదారులు తప్పనిసరిగా గవర్నమెంట్ రూల్స్ పాటించాలని, ప్రమాద నివారణ వివరాలను సూచించారు. టౌన్ ట్రాఫిక్ ఎస్ ఐ చిన్నరావు , ఎన్జీవో సభ్యులు డి .శ్రీరాము మూర్తి, రిటైర్ మాస్టర్,రిటైర్ ఎంఇఓ ఈ.విజయ్‌కుమార్, స్కూల్ హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ ప్రసన్న, పావని, నీలవేణి జూనియర్స్ ఖోఖో స్టేట్ టీమ్ కి ఎన్నిక



విశాలాంధ్ర-గుర్ల: మండలం లో గరికివలస జిల్లా పరిషత్ హైస్కూల్ లో 9వ తరగతి చదువుచున్న సమానం పూజిత, 8వ తరగతి చదువుచున్న సమానం లక్ష్మీ ప్రసన్న, కేసలి పావని బార్నల నీలవేణి జూనియర్స్ ఖో ఖో స్టేట్ టీమ్ కి ఎన్నిక ఐయ్యారు. ఈ పోటీలు ఈ నెల 19 నుండి 21 వరకు ప్రకాశం జిల్లా జె పంగులూరు లో జరగనున్నాయి . ఈ సందర్భంగా స్కూల్ హెచ్ శ్రీదేవి రాష్ట్రా మానవ హక్కుల చైర్మన్ గారు కేసలి అప్పు రావు గారు గ్రామ సర్పంచ్ పెద్దలు స్కూల్ స్టాఫ్ అభినందనలు తెలియజేశారు ఈ విషయం స్కూల్ పీడీ బోడ మల్లికార్జున రావు తెలియజేశారు.

పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

స్థానిక కాంప్లెక్స్ వద్ద సిపిఐ రాస్తారోకో

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ప్రభుత్వ నూతన వైద్య కళాశాలలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానాన్ని అమలు చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా ప్రమాదకరమైనదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ లు మండిపడ్డారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు విజయనగరం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ ప్రైవేటీ కరణ విధానం విద్యార్థుల హక్కులు, ఉపాధి భద్రత, పేద మధ్య తరగతి వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతుందని, రాజ్యాంగం లోని మౌలిక సూత్రాలకు విరుద్ధమై సామాజిక వర్గాల అభ్యున్నతికి భంగం కలిగించే చర్యగా రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలను పిపిపి విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నెంబర్ 590 ని జారీ చేయడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం కొత్తగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటుతో రాష్ట్రంలో వైద్య సీట్ల సంఖ్య పెరుగుతుందని, వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశించడం జరిగిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 590 పేరుతో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి జీవో నెంబర్ 590 తక్షణమే ఉపసంహరించుకోవాలని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 107జీవో నెంబర్ 107, 108ను రద్దు చేయాలని, నూతన వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి నిర్వహించాలని, వాటిని శాశ్వత ప్రభుత్వ, ప్రజా ఆస్తులుగా నిలిపి, పేద ప్రజలు వైద్య విద్య హక్కును, సామాజిక న్యాయాన్ని భవిష్యత్తు తరాల అవకాశాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు బుగత.పావని, పురం.అప్పారావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పొందూరు.అప్పలరాజు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎన్.నాగ భూషణం, బి. వాసు, వి. రాజేష్, సుమన్, చరణ్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ జీఓ 590 రద్దు చేయాలి : సీపీఐ, ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-బొబ్బిలి: కూటమి ప్రభుత్వం నూతన వైద్య కళాశాలలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పిపిపి) విధానాన్ని అమలు చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా ప్రమాదకరమైనదని తక్షణమే విరమించుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న లు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) పార్టీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం పట్టణం స్టేట్ బ్యాంక్ వద్ద డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ విగ్రహం వద్ద పలువురు విద్యా ర్థులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ ప్రైవేటీకరణ విధానం విద్యార్థుల హక్కులు, ఉపాధి భద్రత, పేద మధ్య తరగతి వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతుందని, రాజ్యాంగం లోని మౌలిక సూత్రాలకు విరుద్ధమై సామాజిక వర్గాల అభ్యున్నతికి భంగం కలిగించే చర్యగా రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నెంబర్ 590 ని జారీ చేయడం ప్రభుత్వ దుర్మార్గ చర్యలని ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి జీవో నెంబర్ 590 తక్షణమే ఉపసంహరించుకోవాలని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 107జీవో నెంబర్ 107, 108ను రద్దు చేయాలని, నూతన వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి నిర్వహించాలని, వాటిని శాశ్వత ప్రభుత్వ, ప్రజా ఆస్తులుగా నిలిపి, పేద ప్రజలు వైద్య విద్య హక్కును, సామాజిక న్యాయాన్ని భవిష్యత్తు తరాల అవకాశాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, సిపిఐ బొబ్బిలి పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్. డివిజన్ కార్యదర్శి వి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోంపురంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

55 మందికి వైద్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ

28 మందిని గాయత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి రిఫర్

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. విశాఖ మారికవలసకు చెందిన గాయత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆదేశాల మేరకు,లక్కవరపుకోట క్లినికల్ మెడికల్ క్యాంపు ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరంలో మొత్తం 55 మంది రోగులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆర్థోపెడిక్ వైద్యులు డా. అహుతరామయ్య తెలిపారు.పరీక్షల అనంతరం తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న 28 మందిని మరింత మెరుగైన చికిత్స కోసం విశాఖ మారికవలస గాయత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వివరించారు. సోంపురం గ్రామ సర్పంచ్తో పాటు ఎంపీటీసీలు మురిపిండి గంగరాజు,ఆకులసత్యనారాయణ సారథ్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించగా, గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో వైద్యులు భవాని, త్రినాథ్, హర్షిత, లక్ష్మీ తదితరులతో పాటు వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం స్థానిక రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఇరువురు వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతున్నారని వారి గంజాయి తరలిస్తున్నారని పట్టణ సీఐ సతీష్ కుమార్ కు వచ్చిన సమాచారంపై ఇరువురు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద బ్యాగులను పరిశీలించగా వారి వద్ద సుమారు రెండు కేజీలు గంజాయి లభించడంతో గంజాయిను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారించగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన పవన్ కుమార్, మోహన్ శ్యామ్ లు బెంగళూరు సిటీకి చెందిన వ్యక్తులుగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ క తరలించినట్లుస్థానిక విలేకరులకు తెలిపారు.

వైద్య కళాశాలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ ఈ సమావేశం లో సిపిఐ, వైసిపి, సిపియం, కాంగ్రెస్ పార్టీల నాయకులు కార్యకర్తలు రౌండ్ టేబుల్ సమసమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ నుండి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేటీకర చేస్తే పేదలకు ఇచ్చే రిజర్వేషన్లు ఇస్తాదా కార్పొరేట్ సంస్థలు ఎన్నికల ప్రచారంలో చెప్పేదొకటి అధికారంలోకి వచ్చిన తరువాత చేసేదొకటి ఈ ప్రభుత్వం తీరు పేద దళిత వెనుకబడిన విద్యారులకు రిజర్వేషన్లు ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిది పెట్టుబడిదారుల కోసం కార్పొరేటర్ల కోసం వారి అడుగుల మడు గులు వత్తుతూ వారు చెప్పనట్లు చేస్తూ కోట్ల రూపాయలు వెనకేసుకోవడం కోసమే ఈ ప్రైవేటీకరణ ఇకనైనా మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకారణను మాను కోపోతే మేమంతా కూటమిగా ఏర్పడి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తామన్నారు ఈ కార్య క్రమం లో సిపిఐ నుండి కామేశ్వరరావు, భీముడు, సీపీఎం పార్టీ నుండి ముత్యాలు, వైసీపీ పార్టీ నుండి పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకట్రావు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, కదారి జయశంకర్, చిప్పాడ రమణ, పెనగంటి జగదీష్, షేక్ రెహమాన్, కాంగ్రెస్ పార్టీ నుండి హెచ్.నానాజీ, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విశాలాంధ్ర-విజయనగరం: భారత మాజి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు 19 శుక్రవారం నాడు జిల్లాకు రానున్నారు. ఆరోజు మధ్యాహ్నం 03.30 గంటలకు విశాఖపట్నం లో బయలు దేరి సాయంత్రం 04.45 వి.టి.అగ్రహారంలోని వై జంక్షను దగ్గర గల సిఎంఆర్ లే అవుట్ చేరుకుంటారు. అక్కడ జరిగే కార్యక్రమం లో ఆయన పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 06.00 గంటలకు బయలు దేరి రాత్రి 07.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యు ఆఫ్ ఎస్ (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) పై శిక్షణా కార్యకమం ఈ రోజు 2 సెషన్స్‌గా ఉదయం మధ్యాహ్నం ఇంచార్జి ఎంపీడీఓ అధ్యక్షతన ఎంపీడీఓ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు,అందరు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో సుధాకర్ పట్నాయక్ డిప్యూటీ ఎంపీడీవో ఎస్ వి ఆర్ కె పట్నాయక్ సిహెచ్ శ్రీరాములు నాయుడు మోటివేటర్ ఎస్. లోకేష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. బహుళ ప్రయోజనాలు గల ఈ సర్వే వలన కుటుంబ సభ్యుల వివరములు ఒకే కార్డ్ లో నిక్షిప్తము అయి ఉంటాయి అని దీని వలన భవిష్యత్ లో అందరికి అన్ని సర్వీసులు సులభంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఈ విషయాన్ని ముందుగానే అందరికి వివరించి సర్వే పూర్తి చెయ్యాలి అని సుధాకర్ పట్నాయక్ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లితండ్రులు పిల్లల విద్య పై దృష్టి సారించాలి..

ఎంఈఓ విజయ్ కుమార్

విశాలాంధ్ర-చీపురుపల్లి : 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల విద్య పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని చీపురుపల్లి మండల విద్యాశాఖ అధికారి 2 ఆర్ విజయ్ కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మెట్టపల్లి ఉన్నత పాఠశాల పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులకు రాత్రికాల సమావేశాన్ని గురువారం నాడు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి పాఠశాల బోధన అనంతరం ఇంటిదగ్గర శ్రద్ధగా చదివించడాన్ని తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక విద్యార్థి 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరడానికి విద్యార్థులు తల్లిదండ్రులు తమ వంతు కృషి జరపాలన్నారు.పదవ తరగతి పరీక్షలో దగ్గర పడడంతో విద్యార్థులతో పాటు,తల్లిదండ్రులకు సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ ను తెలియజేస్తూ..ఇంటి వద్ద పిల్లల్ని చదివించాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి ఫలితాలు ఆధారపడి ఉంటాయని హెచ్‌ఎం తెలియజేశారు. పిల్లలు నిత్యం చదవడం వల్ల పరీక్ష అంటే ఒత్తిడి,భయాందోళన లేకుండా పరీక్షల్ని విజయవంతంగా రాస్తారని వివరించారు. అదే విధముగా విద్యార్థులకు తల్లిదండ్రులు పోషక ఆహారం అందిస్తూ, వారి పట్ల పర్యవేక్షణ శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేజేటి.విజయ్ కుమార్,ఉపాధ్యాయులు సుశీల,పద్మలత,పిడి బుసత్యన్నారాయణ,శ్రీను తదితరులు పాల్గొన్నారు..

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి భారీ ప్రోత్సాహం

అనంతపురం, విజయనగరంలలో రెండు కొత్త ఎంఎస్ఎంఈ విస్తరణ కేంద్రాలకు కేంద్రం ఆమోదం : మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర-విజయనగరం: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వృద్ధికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తూ, ఎంఎస్ఎంఈ సంస్థలను ప్రోత్సహించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన రాష్ట్ర ప్రతిష్టాత్మక కార్యక్రమం "ఒక కుటుంబం -ఒక పారిశ్రామికవేత్త"కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ విస్తరణ కేంద్రాల ఏర్పాటు కోసం భారత ప్రభుత్వం అనంతపురం, విజయనగరం లో ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తమ మంత్రిత్వ శాఖకు ఒక ప్రతిపాదనను పంపి సంబంధిత మంత్రి, అధికారులకు ఎంఎస్ఎంఈ విభాగానికి మార్గనిర్దేశం చేయడం కోసం తాము చేసిన నిరంతర ప్రయత్నాలు, భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖతో ఆయన జరిపిన సంప్రదింపుల ఫలితంగా, మంగళవారం అనంతపురం, విజయనగరంలో రెండు ఎంఎస్ఎంఈ విస్తరణ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. ఈ విస్తరణ కేంద్రాల ఏర్పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈ అభివృద్ధికి బాటలు వేస్తాయని, ఈ కేంద్రాలు సాంకేతిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, ఇంక్యుబేషన్ మరియు కన్సల్టెన్సీ సేవలు వంటి సమగ్ర మద్దతును అందించడం ద్వారా ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తాయని తెలియజేశారు. కొత్త సంస్థల ఏర్పాటును ప్రోత్సహించి, స్థానిక ఉపాధిని కూడా సృష్టిస్తాయని తెలిపారు. ఈ చొరవ స్వర్ణ ఆంధ్ర ఏ2047 యొక్క విస్తృత దార్శనికతకు అనుగుణంగా ఉందని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు. ఔత్సాహిక పెట్టుబడిదారులకు సరసమైన ధరలకు భూమి, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవడానికి ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధిని వేగవంతం చేస్తోందని తెలిపారు. ఆవిష్కరణ %ఉ% రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్టార్టప్‌లు, హై-టెక్ సంస్థల సంస్కృతిని పెంపొందించడానికి సహకరిస్తోందని అన్నారు. ఈ చొరవ రాష్ట్రాన్ని ఆవిష్కరణలకు ప్రధాన గమ్యస్థానంగా మార్చడం, గ్రామీణ ఆవిష్కర్తలను ప్రపంచ స్థాయి మార్గదర్శకత్వం మరియు మార్కెట్లతో అనుసంధానించడం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు. కొత్త విస్తరణ కేంద్రాలు విశాఖపట్నంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ మార్గదర్శకత్వంలో పనిచేస్తాయని, హై-ఎండ్ స్కిల్లింగ్: %జారాణ/జారావీ%, సిమ్యులేటర్లు మరియు వర్చువల్ తరగతి గదులలో శిక్షణ అందించటం జరుగుతుందని మంత్రి తెలిపారు. స్థానిక పరిశ్రమలకు అధునాతన యంత్రాలకు అనుసంధానం చేసే అవకాశం కలుగుతుందన్నారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదాల పరిష్కార కమీషన్

ఎఫ్.ఎ. 287 ఆఫ్ 2025

బిట్వీన్:

అథారిసేడ్ సిగ్నటోరి రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్ ... అప్పిలెంట్

అండ్

1. కర్రి గౌరి, వైఫ్ ఆఫ్ కామేశ్వరరావు
2. అథారిసేడ్ సిగ్నటోరి ద్రు. దండ కార్పొరేట్ ఇన్సురెన్స్ సిల్క్ ... రెస్పాండెంట్

పైన సూచించిన రెండవ ప్రతివాది అథారిసేడ్ సిగ్నటోరి ద్రు. దండ కార్పొరేట్ ఇన్సురెన్స్ సిల్క్, రెసిడెంట్ ఆఫ్ డో.నె. 7-44-1, ఫస్ట్ ఫ్లోర్, శ్రీ సాయినాథ్ ఎన్‌క్లేవ్, వెలమ వారి స్ట్రీట్, అపొనె శ్రీరామ డిపార్ట్మెంట్ స్టోర్స్, బెసిదేస్ పంజాబ్ నేషనల్ బ్యాంకు, బొబ్బిలి, ఆంధ్రప్రదేశ్-535558.

శ్రీ కమీషన్ వారు పలుమార్లు మీకు నోటీసు పంపినప్పటికీ మీరు వాటిని అందుకోక తిరిగి పంపుతున్నారు. కనుక శ్రీ కమీషన్ వారు మీకు నోటీసు పేపర్ ప్రకటన ద్వారా పంపమని ఆదేశించి నారు. ది. 05-01-2026న మీరు వ్యక్తిగతంగా కానీ లేక ప్లీడర్ గారి ద్వారా వచ్చి హాజరు కాగలరు శ్రీ కమీషన్ వారి ఎదుట.

శ్రీ కమీషన్ వారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు

జి. వెంకటేశ్వర ప్రసాద్, అడ్వకేట్

డో.నెం. 41-20/1-53/2,

గుంటూరు వారి స్ట్రీట్, కష్ణలంక,

విజయవాడ-520013. సెల్: 9440696216

వాయిదా: 05-01-2026

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలవ లేకుండా చేయాలి - ఎమ్మెల్యే బేబి నాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : మండలం ఎం.బూర్జవలస రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు లేకుండా చూడాలని రైల్వే ఇంజనీర్ సురేష్' ను ఎమ్మెల్యే బేబీనాయన ఆదేశించారు. అండర్ బ్రిడ్జిలో నీరు తోడించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరగడంతో ఎమ్మెల్యే బేబీనాయన స్పందించి రైల్వే ఇంజినీర్'కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు, విద్యార్థులు, కార్మికులు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే బేబి నాయన కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

శత శాతం దాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు చేపట్టండి - ఎమ్మెల్యే బేబి నాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ధాన్యం కొనుగోలు లో రైతుల నుండి శత శాతం దాన్యం కొనుగోలుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబి నాయన ఆదేశించారు.నియోజకవర్గానికి సంబంధించి, ధాన్యం కొనుగోలుపై సంబంధిత రెవెన్యూ , వ్యవసాయ శాఖ అధికారులతో ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ్మోహన్ రావు అధ్యక్షతన ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన)సమీక్షసమావేశం నిర్వహించారు.ఈ సందర్భాంగా ఎమ్మెల్యే బేబి నాయన నాలుగు మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు మరియు వ్యవసాయ శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకు ఎంత ధాన్యాన్ని కొనుగోలుచేశారో అని అడుగగా, 30 శాతం పూర్తయ్యిందని అధికారులు తెలిపారు. ఈ నెలాఖరుకల్లా 80 నుండి90శాతంకొనుగోలుజరిగేలాచూడాలనిఅధికారులకుసూచించారు.అందుకు అవసరమైతే జిల్లా మరియు రాష్ట్ర స్థాయి అధికారులతో తాను మాట్లాడుతానని చెప్పారు.మిల్లర్లు ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా, ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. అవసరమైతే, మిల్లర్లతో మరొకసారి సమావేశమై వారి సమస్యలను పరిశీలిస్తానని అన్నారు.ఈ-క్రాప్ ఎన్రోల్మెంటులో కొన్ని తప్పులు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, వాటిని సత్వరమే సరిదిద్దాలని, లేనియెడల తుఫానుల కారణంగా నష్టపోయిన రైతులకు సరైన న్యాయం చేయలేక పోతున్నామని అన్నారు.రైతులకు అవసరమైన ఎరువులు యూరియ, డీఏపి నిలవలు పై మండలాల వారీగా ఎన్ని ఎకరాలలో వరి మరియు మొక్క జొన్న వంట సాగులో ఉన్నది అని అడిగి తెలుసుకున్నారు.మొక్కజొన్న రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పురుగుల మందులు, ఎరువులను పంటలకు అందించేలా చేసి, రైతులకు ఖర్చు తగ్గించేలా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు తహశీల్దార్ ఎం శ్రీను, వరప్రసాద్ , డిప్యూటీ తహశీల్దార్ సాయి కృష్ణ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి మజ్జ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర -విజయనగరం :క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య విధానాన్ని గమనించారు. అన్న క్యాంటీన్ పరిశీలించారు. 21వ నెంబర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పారిశుధ్య పనితీరును గమనించారు.పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. రహదారులపై చెత్తాచెదారాలు నిల్వ ఉండరాదని సూచించారు. నిర్ణీత సమయానికి విధులకు హాజరై పనులు ముగించుకోవాలి అని చెప్పారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ లను చేపట్టాలన్నారు. ఆ తర్వాత అన్న క్యాంటీన్ సందర్శించారు. ఆహారాన్ని స్వీకరించేందుకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, అలాగే వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. సురక్షితమైన తాగునీరు అందే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి:కమిషనర్

విశాలాంధ్ర-విజయనగరం:భవనాలు,లేఅవుట్లక్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజలకు సూచించారు. ఈ మేరకు ప్రజలలో మరింత అవగాహన తీసుకొచ్చేందుకు ఆయన ఆదేశాలతో నగరంలోని వివిధ ప్రాంతాలలో గోడ రాతలను రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను లే అవుట్ రెగ్యులేషన్ పథకం కింద వెంటనే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. తద్వారా అనధికార ప్లాట్ లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే అనుమతి లేకుండా నిర్మించిన అనధికార భవనాలను, తీసుకున్న ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం ద్వారా వెంటనే దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆయా భవన నిర్మాణాలు క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే బకాయి ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ స్థలముల పన్నులు, నీటి చార్జీలు, ప్రకటన పన్నులు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లు వంటివి తక్షణమే చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలని సూచించారు.

విజన్ బిల్డింగ్-2 పై జిల్లాస్థాయి సమావేశం

విశాలాంధ్ర -గజపతినగరం:గజపతినగరం వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం విజన్ బిల్డింగ్-2 పై మూడవరోజు జిల్లా స్థాయి సమావేశం ఏపీఎం పి. నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి హాజరై ఆయన మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతులై సాధికారత సాధించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి అవసరమైన చిన్న చిన్న కథలు, పాటలు రూపంలో శిక్షణ జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో ఉన్న వనరులు, లేని వసతులను గుర్తించి వాటికి అవసరమైన ప్రణాళిక లు తయారుచేసి మండల సమాఖ్యకు సమర్పించాలని సూచించారు. వాటి ఆధారంగా గ్రామ, మండల సమైక్యలను ఆదర్శవంతంగా తయారు చేయుటకు అవకాశం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు అభివృద్ధి పథంలో నడిపించుటకు సంఘ సభ్యులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని అటువంటి అప్పుడు మాత్రమే ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తయారు చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఏ చిరంజీవి, డిపిఎం పెన్నన్న రవి, ఏపీఎంలు, విశ్వేశ్వరరావు, శేషగిరిరావు మరియు సీసీలు, వివో ఏలు, వివోలు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో ప్రతిభ పరీక్ష నిర్వహింపు

విశాలాంధ్ర- గరివిడి:స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఈ నెల 21వ తేదీ (ఆదివారం) ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. బాల భాస్కరావు తెలిపారు. ఈ ప్రతిభ పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి ప్రతిభ పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అలాగే పోటీ భావాన్ని పెంపొందించేందుకు ఈ పరీక్షలుఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం కళాశాలలో ఈ తరహా ప్రతిభ పరీక్షలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ జె. బాల భాస్కరావు మాట్లాడుతూ, ఈ ప్రతిభ పరీక్ష పదో తరగతి గణితం, భౌతిక శాస్త్రం మరియు రసాయన శాస్త్రం అంశాలపై ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రతిభ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 8121987431, 8142667441, 83091 99291 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి. వెంకటరమణ, ఏఓ జి. అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ ఫెయిర్ విజయవంతం

విశాలాంధ్ర - వేపాడ : మండల కేంద్రమైన వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ను విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారులు ఎన్. నాగభూషణ రావు, పి. బాల భాస్కరరావులు ప్రారంభించి విద్యార్థులను ప్రోత్సహించారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్. వల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు వినూత్న అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు, నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.ప్రత్యేకించి పర్యావరణ పరిరక్షణ,శక్తి వనరులు, ఆరోగ్యం, సాంకేతికతకు సంబంధించిన ప్రాజెక్టులు విద్యార్థులలో ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతిబింబించాయని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనా ధోరణిని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిఆర్ఎంటి లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేశారు.

కానిస్టేబుళ్ళుగా ఎంపికైన అభ్యర్థులు శిక్షణ నిమిత్తం 20న హాజరుకావాలి

ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



విశాలాంధ్ర -విజయనగరంటౌన్ :ఉమ్మడి విజయనగరం జిల్లాకు కానిస్టేబుళ్ళుగా ఎంపికైన 133 మంది పురుష, మహిళా అభ్యర్థులు ఈ నెల 20న జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉదయం 8గంటలకు 9 నెలల శిక్షణ నిమిత్తం వెళ్ళుటకు హాజరుకావాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ మాట్లాడుతూకానిస్టేబుళ్ళగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 22 నుండి శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు కానిస్టేబుళ్ళగా ఎంపికైన 133 మంది పురుష, మహిళా అభ్యర్థులు విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద డిసెంబర్ 20న ఉదయం 8గంటలకు శిక్షణకు వెళుటకు లగేజితో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమతో పాటు 1) లి5 పాస్పోర్ట్ సైజు కలర్ ఫోటోలు2) లి2 స్టాంప్ సైజు కలర్ ఫోటోలు3) లిఒరిజినల్ సర్టిఫికెట్లు4) లిరూ.100/- నాన్ జుడిషియల్ బాండు5) లికప్పుకోవడానికి 2 బ్లాంకెట్స్6) లిరూ.10,000లు - తిరిగి ఇవ్వబడే కాషన్ డిపాజిట్, మెస్ చార్జీలు కొరకు తీసుకొని రావాలన్నారు.హాజరయిన అభ్యర్థులను 9నెలల శిక్షణ నిమిత్తం పురుష అభ్యర్థులను డిటిసి, చిత్తూరుకు, మహిళా అభ్యర్థులను పిటిసి, ఒంగోలుకు పంపుతామని జిల్లా ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు తమ వెంట విలువైన వస్తువులను తీసుకురాకూడదని, శిక్షణా కేంద్రానికి అభ్యర్థుల వెంట బంధువులను అనుమతించరని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పై రైతుల్లో పెరుగుతున్న అభ్యంతరాలు :ఎమ్మెల్సీ ఇందుకూరి

కంపెనీ లో భాగస్వాముల గా ఉన్న రైతుల ప్రమేయం లేకుండా చేసిన జీవో 14, రెక్టిఫికేషన్ డీడ్ చెల్లుతాయా?

విశాలాంధ్ర-శృంగవరపుకోట(రూరల్) : మండలంలో జిందాల్ అల్యూమినియం రిఫైనరీ కోసం సేకరించిన భూముల్లో, నిబంధనలకు విరుద్ధంగా ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు, రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ అంశంపై స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రభుత్వం, రైతులు మరియు జిందాల్ యాజమాన్యం మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందాన్ని తుంగలో తొక్కడంపై నిలదీశారు. 2023 ఫిబ్రవరి 20న విడుదల చేసిన జీవో ఎంఎస్ 14 ద్వారా రైతుల ప్రమేయం లేకుండా భూములను ఎంఎస్ఎంఈ పార్కులకు కేటాయించడం చట్టబద్ధంగా చెల్లదని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. గతంలో అసైన్డ్ భూములను తీసుకున్నప్పుడు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద అనేక హామీలు ఇచ్చింది. ఎకరాకు రూ. రెండు లక్షలా ఐదువందల నగదుతో పాటు, ఉద్యోగ అవకాశం కల్పించలేనప్పుడు కనీస వేతనం అందజేస్తామని చెప్పారు. కానీ ఆ ఒప్పందం నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదు అని ఆయన విమర్శించారు. రైతులందరికీ కంపెనీలో వాటాలు ఇస్తామని అప్పట్లో అధికారికంగా లేఖలు కూడా ఇచ్చారని రఘురాజు గుర్తు చేశారు. అల్యూమినియం రిఫైనరీ నుండి ఎంఎస్ఎంఈ పార్కుగా మార్చినప్పటికీ, ఆ భూముల్లో రైతులు 50% భాగస్వాములుగా ఉన్నారని, ప్రైవేట్ ల్యాండ్ హోల్డర్స్ కూడా ఇందులో వాటాదారులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. భాగస్వాముల అనుమతి లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముగ్గురు భాగస్వాములు (ప్రభుత్వం, రైతులు, కంపెనీ) ఉండాల్సిన చోట, కేవలం ఇద్దరు వ్యక్తులు మాత్రమే కుదుర్చుకున్న రెక్టిఫికేషన్ డీడ్ ఎలా చెల్లుతుందని ఆయన ప్రశ్నించారు. రైతు ప్రమేయం లేని ఈ జీవో గానీ, ఆ తర్వాతి రెక్టిఫికేషన్ డీడ్ గానీ చెల్లవు. ఇన్ని న్యాయపరమైన చిక్కుల మధ్య ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయడం ఎలా సాధ్యం అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను కేవలం భూములు ఇచ్చిన వారిగా కాకుండా ప్రాజెక్టులో భాగస్వాములుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ వాటా తేల్చకుండా భూములను ఇతర అవసరాలకు మళ్లించడం వెనుక ఏదో కుట్ర దాగి ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ముగ్గురు వాటాదారులు ఉన్న చోట ఇద్దరే సంతకాలు చేసుకుంటే అది మోసం కిందకే వస్తుంది అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర - బొబ్బిలి : ఎమ్మెల్యే బేబినాయన ఆదేశాలతో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.10 వ వార్డు అంబేద్కర్ కాలనీ యందు కర్రి గోపాల్ ఇంటి నుండి కె ప్రసాద్ ఇంటి వరకు సి రోడ్డు నిర్మాణం చేయుటకు 15 వ విడత నాలుగు లక్షలు నిధులు),15వ వార్డులో మేదర బంద జంక్షన్ నుండి నెయ్యిల వీధి కి వెళ్లే మార్గం లో మేదరబంద మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర పాడైన కల్వర్ట్ ను బాగు చేయటకు ఐదు లక్షలు జనరల్ ఫండ్ నిధులుతో, 17వ వార్డు మార్కెట్ వీధియందు శ్రీపతి గౌరి శంకర్ ఇంటి నుండి కెవీఆర్ షాప్ వరకు సి సి డ్రైన్లు నిర్మాణం చేయుటకు అంచనా వ్యయం నాలుగు లక్షలు (15 విడత ఫైనాన్స్ నిధులు) 18వ వార్డు - కె. సి. ఐ. సి రోడ్డు యందు నరేష్ ఇంటి నుండి బలివాడ జగదీష్ ఇంటి వరకు సీ రోడ్డు నిర్మాణం చేయుటకు 2.30 లక్షలు(15 వ విడత ఫైనాన్స్ నిధులు) 17 వ వార్డు : అల్లంరాజు వీధి యందు ఎస్బిఐ ఎటిఎం నుండి భోగి అప్పయ్యమ్మ ఇంటి వరకు సి. సి డ్రైన్ నిర్మాణంచేయుటకుఅంచనా వ్యయం 6.08లక్షలు(15 వ విడత ఫైనాన్స్ నిధులు)30 వార్డు టి ఆర్ కాలనీయందు పలగర రమణమ్మ ఇంటి నుండి రాజా బత్తుల మహేష్ ఇంటి వరకు రిటైనింగ్ వాలు ను పొడిగించుటకు గానుఅంచనా వ్యయం 4.50 లక్షలు (15 వ విడత ఫైనాన్స్ నిధులు) 25 వార్డు మారుతి నగర్ యందు భరత్ పెట్రోల్ బంక్ నుండి కె. సత్యనారాయణ ఇంటి వరకు సి సి రోడ్డు నిర్మాణం చేయుటకుఅంచనా వ్యయం ఐదు లక్షలు (జనరల్ ఫండ్ నిధులు) తో మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు శంఖుస్థాపన చేసిన పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు మరియు సంబంధిత కాంట్రాక్టర్లు వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. కిరణ్ కుమార్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్స్ ఎ ఎస్ కోటేశ్వరరావు, వివిధ ఎస్ ఎన్ ఈ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

13 మందికి రూ.9.62 లక్షల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్: విజయనగరం నియోజకవర్గానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.9,62,293/- విలువ గల చెక్కులను పార్టీ కార్యాలయంలో శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అర్హులైన వారికి సహాయం అందించడం తమ బాధ్యతగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ ఆర్థిక సహాయం అందించగలిగినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.లబ్ధిదారులు మాట్లాడుతూ తమ సమస్యలను సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గంటా రవి, గంటా పోలనాయుడు, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు కోదండరాం, పాశి అప్పలనాయుడు అనురాధ బేగం, పైలా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు:లంక హారిణి - జొన్నవలస - రూ.25,560/-,తాళ్లపూడి సురేష్ - 44వ డివిజన్ - రూ.62,038/-,బుద్దేపు పైడిరాజు - 25వ డివిజన్ - రూ.50,000/-,వల్లిపెల్లి అప్పలనాయుడు - 30వ డివిజన్ - రూ.90,277/-,బడుకొండ హారిక - బడుకొండపేట - రూ.1,28,663/-,దాములూరు దివ్యవాణి - 47వ డివిజన్ - రూ.59,995/-,కరణం సూర్యనారాయణ - 1వ డివిజన్ - రూ.1,49,298/- ,కనకందత్ శబరీష్ బాబు - 26వ డివిజన్ - రూ.60,000/-,తనికెళ్ళ కళ్యాణి - 20వ డివిజన్ - రూ.1,20,583/-,వేచలపు నాగ భూషణం - రాకోడు - రూ.24,446/-,ఎర్నాగుల సూర్యసంతోష్ - రూ.32,255/-,కోరాడ రోహిత్ కుమార్ - 49వ డివిజన్ - రూ.74,348/-,జీర్ల పైడిరాజు - 11వ డివిజన్ - రూ.84,830/

బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించాలి

విశాలాంధ్ర -విజయనగరం: ప్రతీ పోలింగ్ బూత్‌కు తమ ప్రతినిధిగా ఒక ఏజెంట్‌ను (బిఎల్ఏ) ప్రతీ రాజకీయ పార్టీ నియమించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళి కోరారు. తమ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వ్యక్తులను అదే నియోజకవర్గంలో ఎక్కడైనా బిఎల్ఏగా నియమించుకొనే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. బిఎల్ఎలను నియమించుకోవడం ద్వారా ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో15,73,576 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఓటర్లు ఎప్పుడైనా ధరఖాస్తు చేయవచ్చునని తెలిపారు. తమ ధరఖాస్తు స్థితిని ఏ పౌరుడైనా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని డిఆర్ఓ సూచించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుంచి ఐవిపిరాజు, వైకాపా నుంచి శ్రీనివాసరెడ్డి, సిపిఎం నుంచి టి.సూర్యనారాయణ, బిఎస్‌పి నుంచి సోములు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వినియోగదారుల దినోత్సవంపై వ్యాచరచన పోటీ



విశాలాంధ్ర - వేపాడ : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,వేపాడలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారులు ఎన్. నాగభూషణ రావు, పి.బాల భాస్కరరావు గార్లు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. ఎస్. వల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా "ఏఫిసైంట్ అండ్ స్పీడీ డిస్పొషల్ త్రు డిజిటల్ జస్టిస్ " అనే అంశంపై వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో స్కూల్ స్థాయి (6వ తరగతి నుండి 10వ తరగతి వరకు) విద్యార్థులు,అలాగే కళాశాల స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సి ఆర్ ఎం టి లు పాల్గొని విద్యార్థులకు తగిన మార్గనిర్దేశం చేశారు.జాతీయవినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలు విద్యార్థుల్లో చైతన్యం కలిగించాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

తెంటు లక్ష్మంనాయుడు తల్లి మృతి

విశాలాంధ్ర -బాడంగి: స్వర్గీయ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్ సతీమణి తెంటు లక్ష్మంనాయుడు తల్లి శ్రీమతి సత్యవతమ్మ బుధవారం రాత్రిహైదరాబాద్ లో స్వర్గస్తులైనారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు తెలిపారు. గురువారం రాత్రికి కి పార్థివ దేహం ముగడ చేరుకుంటుందని అన్నారు. ఆమె మృతి పట్ల తెలుగుదేశం పార్టీ అభిమానులు కార్యకర్తలు నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఇన్చార్జి ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, బాడంగి సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ సభ్యులు, పాలవలస గౌరి, దేవరపల్లి శ్రీనివాసరావు, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు సత్యం, మాజీ ఎంపీపీ బొంతు త్రినాధ నాయుడు, సర్పంచులు చప్ప తిరుపతి నాయుడు, శివుని నాయుడు, ఆవు సత్యనారాయణ తోపాటు పలువురు అధికారులు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉపయోగించని వీల్ చైర్లను అందజేయండి

అఖిలభారత అవయవదాతల సంఘం రాష్ట్ర కార్యదర్శి శివాజీ

విశాలాంధ్ర- విజయనగరంఫోర్ట్: ఎవరి వద్దనైనా నిరుపయోగంగా ఉండే వీల్ చైర్లు,ఊత కర్రలు, లేవెట్రీ స్టాండ్లను అవసరమైన వారికి అందజేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి,అఖిల భారత అవయవదాతల సంఘం రాష్ట్ర కార్యదర్శి షిణగం శివాజీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గురువారం బొబ్బాధిపేటకు చెందిన దివంగత కొల్లి వెంకట నాయుడు సతీమణి కొల్లి పద్మిని తన ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వీల్ చైర్, ఊత కర్ర,లేవట్రీ స్టాండను మంచానికి పరిమితమైన గరివిడి మండలం కొండశంభం గ్రామానికి చెందిన గొర్లెపెంటమనాయుడుకు అందజేశారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ మా కుటుంబ మిత్రులైన దివంగత కొల్లి వెంకట నాయుడు ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వీటిని ఇన్స్పైట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొర్లె చిన్నమనాయుడు ద్వారా పెంటమనాయుడు మంచానికి పరిమితమైనట్లు తెలుసుకొని వీటిని వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు.ఈ విధంగా ఎవరి ఇండ్లలోనైనా ఇటువంటి పరికరాలు నిరుపయోగంగా ఉంటే మంచానికి పరిమితమైన నిరుపేద రోగులకు అందజేస్తే ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాళ్ళ రామారావు, బోర గోవిందమ్మ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ప్రత్యేక అధికారి

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో వల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం మండల ప్రత్యేక అధికారి దినకర్ సందర్శించారు. వంద రోజులు యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులందరూ బాగా అమలు చేయాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భానుప్రకాష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు

రాష్ట్రస్థాయి వాలీబాల్ తృతీయ స్థానాన్ని సాధించిన విద్యార్థినిలు

విశాలాంధ్ర- గరివిడి: ఈ నెల 16 నుండి 18 వరకు నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ బాలికల పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని సాధించింది. ఈ జట్టుకు గరివిడి శ్రీమతి గోదావరి దేవి సరాఫ్ సీనియర్ సెకండరీ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని మీసాల అశ్విని కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును విజయపథంలో నడిపించారు. ఆమె ప్రదర్శించిన అద్భుతమైన క్రీడా ప్రతిభను గుర్తించిన సెలెక్షన్ కమిటీ అశ్వినిని అండర్14 జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపిక చేసింది.ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ బలిజేపల్లి రవి, వ్యాయామ ఉపాధ్యాయులు బి.వి.ఎస్.ఆర్. మూర్తి, పి. సదానంద్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అశ్వినిని ఘనంగా అభినందించారు. అశ్విని తండ్రి స్థానిక ఎస్‌డిఎస్ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండటం విశేషం. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ గోదావరి దేవి సరాఫ్ పాఠశాల కీర్తిని పెంచిన అశ్వినిపై అందరూ హర్షం వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో సేవల పరిశీలనలో ఎంపీడీవో

విశాలాంధ్ర- భోగాపురం : గూడెవువలస,ఎ.రావివలస గ్రామాల్లో మండల అభివృద్ధి అధికారి స్వరూపరాణి గురువారం పర్యటించారు. గూడెపువలస సచివాలయంలో వివిధ రికార్డులను తనిఖీ చేసి, ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గమనించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, నిల్వల స్థితిని తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహారం, సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎ రావివలస గ్రామంలో ఆధార్ నమోదు శిబిరాన్ని సందర్శించి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటన ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే అంశాన్ని సమీక్షించినట్లు తెలిపారు.